కథా నిలయం
శ్రీకాకుళం

# నిశ్శబ్ద పోరాటం

-సి హెచ్. వి. యస్. బ్రహ్మానందరావు

జీవితంలో ప్రతి క్షణం చేసేది పోరాటం. ఈ పోరాటంలో కొన్నిసార్లు గెలవవచ్చు, కొన్నిసార్లు ఓడిపోవచ్చు. అయినా ఈ పోరాటం ఆగదు. ప్రతి మనిషి నిత్యం ఎన్నో సమస్యలతో సతమతమవుతూ వుంటాడు. సంసారం అనేది సాగరం. సాగరం లోతు తెలుసుకోవడం ఎంత కష్టమో... సంసారం ఈదడం కూడా అంతే కష్టం. అన్నిటికన్నా నిశ్శబ్దంతో పోరాటం చేయడం ఎంత కష్టమో- ఎవరికైనా అనుభవం మీదే తెలుస్తుంది. నలభై వత్సరాలుగా బడిపంతులు ఉద్యోగంలో వున్న నేను క్లాసులు పిల్లలు అల్లరి చేస్తుంటే... భరించలేక నిశ్శబ్దం... నిశ్శబ్దం అంటూ అరుస్తూ ఉండేవాడ్ని. పాఠం చెప్పేటప్పుడు అసలు శబ్దాన్ని తట్టుకోలేక పోయేవాడ్ని. సూది కిందపడ్డ శబ్దం వచ్చినా... అశాంతిగా వుండేది నాకు. దీనికి నా ఆర్థిక పరిస్థితులు కూడా ఒక కారణం. అయితే ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా, సహాయం చేయకుండా ఉండలేకపోవడం నా బలహీనత. ఎదుగు బొదుగు లేని జీవితం. చాలీ చాలని జీతం. బంధువులమంటూ వచ్చేవాళ్ళు, వెళ్ళే వాళ్ళు... గుండెల మీద కుంపట్లలా నలుగురు ఆడపిల్లలు. ఇన్ని సమస్యల మధ్య బ్రతుకు బండి లాగుతున్న సగటు మనిషిని. ఇంటికెళ్ళాలంటేనే భయం. అందుకే ఎక్కువ సమయం స్కూల్‌లోను, సాహితీ సభలలోను గడుపుతుంటాను. స్కూలులో కొలీగ్స్ అందరూ ట్యూషన్స్ చెప్పి డబ్బులు సంపాయించేవారు. నన్ను కూడా చెప్పమన్నారు. కాని నేర్చుకున్న విద్యను అమ్ముకోవడం ఇష్టంలేక నేను సున్నితంగా తిరస్కరించేవాడిని. నన్నో వెర్రి వెధవని చూసినట్లు చూసేవారు. అయినా నేను బాధపడలేదు. నాకు ఎక్కడ సాహిత్య సభలు జరిగినా వెళ్ళటం, అక్కడ కవితలు చదవడం అలవాటు. అప్పుడప్పుడు అవధానాలలో కూడా పాల్గొనేవాడిని. అంతేకాదు సాహిత్య పత్రికలు చదవడం, వాటికి చందాలు కట్టి ప్రోత్సహించడం చేస్తుండేవాడ్ని. ఒకప్పుడు భారతి, యువ వంటి పత్రికలు సాహిత్యానికి బాగా ప్రోత్సాహమిచ్చేవి. వర్ధమాన కవుల, కవయిత్రుల కవితలను వేస్తూ, కొత్తదనానికి ప్రాధాన్యం ఇచ్చేవి. సాహిత్యాన్ని కొని చదివేవారు తగ్గిపోతుండడంతో... ఆ పత్రికలు కనుమరుగయ్యాయి. ఆ తర్వాత కొన్ని సాహిత్య పత్రికలు వచ్చినా ఎక్కువ కాలం కొనసాగలేదు. ఇటీవల పత్రిక మన మాసపత్రిక అంటూ నిర్వాహకులు సాహిత్యాభివృద్ధికి కృషిచేస్తూ... కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్నారు. ఇలాంటి పత్రికలకు చందాలు కట్టడం, చందాలు కట్టించడం అలవర్చుకుంటే సాహితీ ప్రపంచం రారాజుగా వెలుగొందుతాయి. అందుకే నేను, నా మిత్రులందరికి చందాలు కట్టమని చెపుతుంటాను.

ప్రావిడెంట్ ఫండ్ మీద లోన్ తీసుకుని ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేశాను. పిల్లవాడు డిగ్రీ చదువుతున్నాడు. కాలం ఎప్పుడు ఒక్కలా వుండదు కదా! అది కూడా మనుషులకు పరీక్ష పెడుతుంది. పరీక్ష అనగానే ప్రతివాడు చదువులే అనుకుంటాడు. కాని చదివి పరీక్షలు వ్రాసి పాసవడం చాలా తేలిక. ఎందుకంటే పరీక్షల తేదీని నెల రోజుల ముందే ప్రకటిస్తారు. అప్పటి నుంచి విద్యార్థుల కంటే విద్యార్థుల తల్లి తండ్రులు రాత్రి, పగలు కష్టపడి పిల్లవాడు పరీక్షలు వ్రాసేలా సహకరిస్తుంటారు. కాని జీవితంలో మనిషి ఎదుర్కొనే పరీక్షలకు సమయం వుండదు. టైంటేబుల్ ఇవ్వరు. అసలు ఏ క్షణంలో ఏ పరీక్ష జరుగుతుందో తెలియదు. ఇక్కడ ఫెయిల్ అయ్యామంటే మాత్రం వైకుంఠ పాళిలో పెద్ద పాము నోట్లో పడినట్లే! అందుకే ప్రతి చిన్న విషయంలో ఆచి తూచి అడుగేయాలి. గెలుపుని సొంతం చేసుకోవాలి. నేను గత జన్మలో ఏ పాపం చేశానో తెలియదు కాని ఇటీవల నా చెవులు వినికిడి శక్తిని కోల్పోతున్నట్లుగా అనిపిస్తుంది. కొద్ది రోజుల నుండి పిల్లవాడు గట్టిగా మాట్లాడితే కాని వినిపించడంలేదు. ప్యూన్ వచ్చి 'సార్' అని అరిస్తే గాని వినపడి చావడంలేదు. హెడ్‌మాస్టర్ ఎదురుగా కుర్చీలో కూర్చున్నప్పుడు ఆయన చెప్పేది నాకు వినపడదు. అంతా అయ్యాక చివరిలో అలా చేస్తే బాగుంటుంది! ఏమంటారు? అని గట్టిగా చెపుతారు. అదొక్కటే వినిపిస్తుంది. అయినా నవ్వుతూ తలూపుతాను. కొలీగ్స్ టీ తాగుతున్నప్పుడో, టిఫిన్ చేస్తున్నప్పుడో ఏదేదో మాట్లాడుతున్నా నేను శ్రోతలా వుండిపోతాను. వాళ్ళు నవ్వితే నవ్వుతాను. వాళ్ళు సీరియస్‌గా వుంటే నేను అలాగే వుంటాను. నాకు చెవుడు

# కుళ్ళు కళ్ళు తెరిపించండి!

శ్రీనాథుడైనా... శ్రీశ్రీ అయినా
ఆరుద్ర అయినా సి.నారె. అయినా
శేషేంద్రుడైనా అద్దేపల్లి అయినా
శార్వరి అయినా అజంతా అయినా
అందరు చెప్పేదీ కవిత్వమే!
ఎవరి శైలి... బాణీ వారిది!
ఎవరు ప్రయోగించినా
అచ్చులు... హల్లులు... ఒత్తులు... పొల్లులు
సున్నాలు హ్రస్వాలు దీర్ఘాలు అవే!
భావం స్వంతమైనా భాష ఒక్కటే!
అల్లిక... జిగిబిగి... శిల్పం
పదాడంబరం... భాషాపటాటోపం
చదివేక ఎందరు జీర్ణించుకోగలరు?
సరళమైన భాషతో
భావ పదజాలంతో
సామాన్యులకు అర్థం కావాలి కదా!?
అవినీతి అన్యాయం అక్రమాలపై దాడికి...
కత్తులు కొడవళ్లు బాంబులే కావాలా?
నాదాలు... నినాదాలు... బేధాలు అవసరమా?
కవికున్న బలం 'పెన్నే'! అది ఏకే-47 కంటే
శక్తివంతమైనది!
వెన్నుపోటు బలం కంటే
పెన్ను వేటు దాడి పదిలమైనది! ఘనమైనది!
రండి రండి కవులారా
మనమందరం ఏకమై
కవితా శరాలు సంధించి
ఈ కుళ్లు సమాజాన్ని చీల్చి చెండాడుదాం!
పీడపీడల బారి నుండి
మానవాళిని రక్షిద్దాం!
కులం బలం కంటే
కలం బలం శాశ్వతమని చాటుదాం!!
రండి రండి కదలి రండి
నవ సమాజ నిర్మాణానికి
మనమంతా ఏకమై నడుం బిగిద్దాం!!
విప్లవాత్మక మార్పులు తెద్దాం! సాధిద్దాం!!

-యస్. వివేకానంద

అనే విషయం ఎవరికి తెలియకుండా జాగ్రత్తపడు తున్నాను.

ఒకరోజు బజార్లో వెళుతుంటే శాస్త్రిగారు ఎదు రయ్యారు.

"నమస్కారం రామనాథంగారు! మీ అమ్మాయి లిద్దరికి మంచి సంబంధాలు వచ్చాయి. పిల్లలు బుద్ధిమంతులు. మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. కట్నానికి కూడా ఆశించటంలేదు. వచ్చే ఆదివారం పెళ్ళిచూపులకి వస్తామన్నారు. ఏమంటారు?" అన్నారు.

ఆయన ఏం చెపుతున్నాడో తెలియకపోయినా... నవ్వుతూ తలూపాను ఆయన వెళ్ళిపోయాడు.

○ ○ ○

ఆదివారం రానే వచ్చింది. నేను పరీక్ష పేపర్లు దిద్దుకుంటూ ఇంట్లోనే వున్నాను. నా శ్రీమతి రాజ్యం హడావుడి పడుతూ వచ్చింది.

"ఏమిటండి! పిల్లల్ని చూసుకోవటానికి పెళ్ళి వారొస్తున్నారని మాటమాత్రం చెప్పలేదు. ఇప్పుడెలా! ఇంట్లో ఏమీ లేవు!" అన్నారు.

ఆవిడ ఏం చెపుతుందో వినపడటంలేదు. ముఖం లోని భావాల్ని బట్టి ఏదో ఆందోళన పడుతుందని అర్థమైంది.

నేనేం మాట్లాడలేదు.

"నా ఖర్మ. ఏ విషయం పట్టదు మీకు" విసురుగా వెళ్ళింది.

పది నిమిషాలకు శాస్త్రిగారు వచ్చారు. అపుడర్థమైంది నాకు. అపుడు దారిలో కనపడి చెప్పింది పిల్లల పెళ్ళి సంబంధాలని. ఇప్పుడు పిల్లలని చూసుకోవటానికి వచ్చుంటారు.

"శాస్త్రిగారు! మీరు పెళ్ళివారితో మాట్లాడూ వుండండి. ఇప్పుడే వస్తాను" అని బట్టలు మార్చుకుని బయలుదేరుతూ...

"రాజ్యం! పిల్లల్ని రెడీచెయ్యి! నేను ఇప్పుడే వస్తాను! ఏడీ నీ సుపుత్రుడు. ఎక్కడా కనిపించలేదు" అని వెళ్ళారు.

స్వీట్స్, హాట్, పూలు, పళ్ళు తెచ్చారు.

పెళ్ళిచూపుల తతంగం పూర్తయింది.

అమ్మాయిలిద్దరు బాగా నచ్చారు. మంచి ముహూర్తం చూసి తాంబూలాలు పుచ్చుకుందాం. కట్నకానుకలు అవసరం లేదు. పెళ్ళిళ్ళు కూడా నిరాడంబరంగా జరిపించండి! ఆర్భాటాలకి పోవద్దు! అన్నారు పరంధామయ్యగారు.

రామనాథంగారు నవ్వుతూ తలూపారు.

○ ○ ○

రామనాథం గారు తనకు చేతనయినంత వరకు పిల్లల పెళ్ళిళ్ళు బాగానే జరిపించారు. ఇక ఆయనకున్న ఒకే ఒక బాధ్యత రవిచంద్రకు ఏదన్నా ఉద్యోగం చూపించడం. లంచాలు కట్టి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే స్థోమత నాకు లేదు. డిగ్రీ కంప్యూటర్ చది వాడు కాబట్టి ఏదన్నా మంచి ప్రైవేట్ కంపెనీలో చూడాలి అనుకున్నారు. ఎలాగూ పది రోజుల్లో రిటైరవు తున్నాను. రిటైర్ అయ్యాక వచ్చే బెనిఫిట్స్ వాడేసు కున్నాను కాబట్టి పెద్దగా చేతికి వచ్చేది ఏం లేదు. ఇకనుండి కుటుంబానికి వచ్చే పెన్షన్ ఆధారం. ఖర్చులు కూడా తగ్గించుకోవాలి. నలభై సంవత్సరాలు ఉద్యోగం చేసినా, సొంత ఇల్లు కూడా ఏర్పాటు చేసుకోలేదు. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలని తాకుతున్నాయి. పాలకులు ప్రవేశపెట్టే బడ్జెట్‌కు సామాన్యుడు బలవుతూనే వున్నాడు. గ్లోబలీకరణతో కార్పొరేట్ రంగం చిన్న వ్యాపారులను దెబ్బతీస్తుంది. వినియోగదారుడ్ని దోపిడీకి గురిచేస్తున్నయి. టెక్నాలజీ అభివృద్ధి చెందుతుంటే చిన్న చిన్న వ్యాపారులు రోడ్లపాలవుతున్నారు. కంప్యూటర్‌లు పెరిగి టైపుమిషన్ల ఉనికి కోల్పోయాయి. టీవీలు ప్రవేశించాక రేడియో కార్యక్రమాలు గల్లంతయ్యాయి. గ్లోబలీకరణాలు పేదవాడు మరింత పేదవాడుగా, ధనవంతుడు ఇంకా ఇంకా బలిసిపోతున్నాడు. యంత్రాలు ప్రవేశంతో కార్మికుల బ్రతుకులు ఛిద్రమైనాయి. మధ్యతరగతి కుటుంబాల బ్రతుకు ప్రశ్నార్థకంగా మారింది. నిరుద్యో గులు ఉద్యోగాల కోసం, కార్మిక, శ్రామికులు పనుల కోసం, ఉద్యోగస్థులు భద్రత కోసం, విద్యార్థులు తమ హక్కులను కాపాడుకోవడం కోసం ఉద్యమాలు సాగిస్తు న్నారు. పాలకుల అసమర్థతని నిలదీస్తున్నారు. దేశం అంధకారంగా మారుతుంటే, పాలకులు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు.

○ ○ ○

రామనాథం గారు పదవీ విరమణ చేసి వారం రోజులయింది. ఈ వారం రోజులు ఆయన ఇంట్లోంచి బయటకు వెళ్ళలేదు. ఎలాగు ఎదుటివాడు ఏం మాట్లా డినా వినపడదు. వాళ్ళు మాట్లాడిన తర్వాత తను మాట్లాడకపోతే ఏమన్నా అనుకుంటారేమోనని భయంతో ఇంట్లోనే వుండిపోయారు. వారం రోజులుగా ఇంట్లోనే వుండడంతో బందిఖానాలో వున్నట్లుగా వుంది. ఇంట్లో ఎవరి పనుల్లో వారుంటారు. అయినా వాళ్ళు మాట్లాడినా తిరిగి తను మాట్లాడలేదు. ఏదైనా బయటకెళితే కాస్త రిలీఫ్‌గా వుంటుందనుకొని బట్టలు మార్చుకుని బయటికి వచ్చారు. ఎక్కడ కాలక్షేపం చెయ్యాలా అని ఆలోచించి ముందుగా లైబ్రరీకి వెళ్ళి నగరంలో నేడు పేజీ చూశారు. ఆ రోజు ఎక్కడా సాహితీ సభలు లేవు. కాసేపు పేపర్లు చదివి కాలక్షేపం కోసం పార్కుకెళ్ళారు. పార్క్‌లో ఎవరూ లేని ఏకాంత ప్రదేశంలో కూర్చున్నారు.

వాతావరణం ఆహ్లాదంగా వుంది. అపుడపుడే చీకట్లు ముసురుకుంటున్నాయి. ఆకాశంలో పక్షులు గూళ్ళకి చేరుకుంటున్నాయి. పార్క్‌లో లైట్లు వెలిగాయి. అక్కడ వున్నవారికి ఎవరికి ఎవరితోను పని వుండదు. ఎవరి ఆనందం వారిది. పెద్దలు తమ అనుభవాలని చెప్పుకుంటు ఆనందిస్తుంటే.. పిల్లలు ఆటల్తో కాలక్షేపం చేస్తున్నారు. ప్రేమజంటలు అక్కడక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఒక కవిగారన్నట్లు ప్రేమికులకు లోకంతో పని వుండదు. వారి ప్రపంచమే వేరు. ఆ కొత్త ప్రపంచానికి వారే రారాజులు. అంత గొప్పతనం ప్రేమ అనే రెండక్షరాలలో వుంది. వారు ఎంత ప్రేమి కులు అయినా పిరికితనం వలన ప్రేమ విఫలమవడం, జీవితాలని నాశనం చేసుకోవడం జరుగుతుంది. అం దుకే ప్రేమించుకుని వారికి ధైర్యం కావాలి. పిరికి తనంతో చనిపోవడం అవివేకం. ప్రేమ గొప్పదే. అలాగని ప్రేమ జీవితం కాదు. తల్లిదండ్రులు పిల్లల మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. పిల్లల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తుంటారు. అలాంటి వారికి కడుపుకోత మిగల్చటం న్యాయం కాదు. ప్రేమకన్నా ఆశయం గొప్పది. కరిగిపోతున్న కాలాన్ని వెనక్కి తెచ్చే టెక్నిక్ మనిషి కనిపెట్టలేదు. మనిషి తన మేధాశక్తితో చంద్ర మండలంపై కాలుపెట్టగలిగాడు. రాకెట్‌లు ప్రయోగించాడు. కాని మరణాన్ని జయించలేక పోతున్నాడు. ప్రకృతిలో వచ్చే పరిణామాల్ని ఊహించ లేకపోతున్నాడు. అందుకే జీవితంలో ప్రతిక్షణం అమూల్యం. ఎప్పుడైతే మనం ఆశయసాధకులమవు తామో.. అప్పుడే విజయులుగా నిలుస్తాం. కాని యువత నేడు వస్తున్న విధ్వంసకర చిత్రాలు, భ్రష్టు పట్టించే టీవీ మీడియా మత్తులో పడి భవిష్యత్తుని నాశనం చేసుకుంటూ... నేర ప్రవృత్తిని పెంచుకుంటూ శాడిస్టులుగా మారుతూ అమాయక ఆడపిల్లల పాలిట ప్రేమోన్మాదులై వాళ్ళని అంతం చేస్తున్నారు. తల్లిదం

డ్రులకు డబ్బు సంపాదించడం మీద వున్న శ్రద్ధ, పిల్లల మీద లేకపోవడంతో ఇలాంటి పరిణామాలు సంభవిస్తున్నాయి.

ఆలోచనలో వున్న రామనాథం గారు చేతి 'వాచి' చూసుకుని–

అమ్మో.. 8 గంటలు దాటింది. ఇంట్లో తనకోసం కంగారుపడతారు అనుకుని లేచి పార్కు బయటికి వచ్చి ఇంటివైపు నడవ సాగారు.

❍ ❍ ❍

కాలం ఎవరి కోసం ఆగదు. తన పని తాను చేసుకుపోతూనే వుంటుంది. కాలం మారిందంటాం కాని కాలం ఎప్పుడూ ఒకేలా వుంటుంది. మనుషుల మనస్థత్వాలలోనే మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు గురువు కనపడితే రెండు చేతులు జోడించి 'నమస్కారం మాస్టారు! బావున్నారా!' అంటూ ఆప్యాయతతో పలకరించేవారు. తర్వాత కాలంలో 'హలో బాగున్నారా?' అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చేవారు. ఇప్పుడు 'హాయ్! ఎక్కడో చూసినట్లుందే!' అంటున్నారు. దానికి తగ్గట్లే సినిమాలు కూడా పంతుళ్ళని జోకర్లులా మార్చి వేస్తున్నాయి. ఒకప్పుడు వృత్తికి అంకితమై పేరుతెచ్చుకున్న ఉపాధ్యాయులు నేడు అనేక ప్రవృత్తులను ఎంచుకోవటం కూడా సమాజంలో ఉన్నతమైన స్థానానికి దూరమవుతున్నాడేమో! ఉపాధ్యాయులలో నీచాతి నీచమైన లైంగిక ప్రవృత్తి పెరగడం కూడా ఉపాధ్యాయుడు పొందవలసిన గౌరవానికి దూరమవుతున్నాడేమో!

రవిచంద్రకి హారికతో వివాహమవడం, ఇద్దరు పిల్లల తండ్రి అవడంతో రామనాథం గారికి కాలక్షేపం బాగానే అవుతోంది. ఆయనకి వినిపించకపోవడం అనే లోపం తప్ప ఎలాంటి లోటూ లేకుండా జీవితం హాయిగా గడిచిపోతుంది. కోడలు కూడా మావగారిని, అత్తగారిని సొంత తల్లిదండ్రుల్లా చూసుకునేది రావడంతో రోజులు బాగానే గడుస్తున్నాయి.

రామనాథం గారు వినికిడిశక్తి కోల్పోయారనే విషయం హారిక వల్ల ఇంట్లో అందరికీ తెలిసింది.

ఇన్ని సంవత్సరాలు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడినా కోడలు పిల్ల కనిపెట్టినందుకు ఆమెను అభినందించాలో, తాను బాధపడాలో అర్థం కాలేదు.

ఈ విషయం ఎవరికి చెప్పనందుకు అందరూ బాధపడ్డారు.

రవిచంద్ర బలవంతంగా తండ్రిని ఐ.ఎన్.టి. స్పెషలిస్ట్ దశరథ్ గారి దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఆయన రామనాథం గారి చెవిని పరీక్షించిన తర్వాత రవిచంద్రతో...

"రవిగారు! మీ నాన్నగారు అలక్ష్యం చేసిన కారణంగా కర్ణభేరికి రక్షణ కవచంగా వుండే చిన్న పొరకి ఇన్‌ఫెక్షన్ సోకింది. మిషన్ వలన ఎలాంటి వుపయోగం వుండదు. ఆపరేషన్ చెయ్యాలి" అన్నారు.

"ఎప్పుడు చేస్తారు డాక్టర్!" అన్నాడు.

"ముందు మందులతో చెవి లోపల క్లీన్ చెయ్యాలి. అలా వారానికి రెండుసార్లు క్లీన్ చేశాక నెలలోపు ఆపరేషన్ చెయ్యాలి" అన్నారు.

"ఆపరేషన్‌కి ఎంతవుతుంది డాక్టర్?"

"ఏభై వేలయినా అవొచ్చు. మీరెప్పుడు మొదలు పెట్టమంటే ట్రీట్‌మెంట్ అపుడు మొదలెడదాం" అన్నారు.

"వారం, పది రోజుల్లో కలుస్తాను డాక్టర్" అన్నాడు.

"ఓకే! అలాగే" అన్నాడు డాక్టర్ దశరథ్ రవిచంద్ర ఇచ్చిన ఫీజు తీసుకుని.

"ఏమయిందిరా? డాక్టర్‌గారేమన్నారు?" అన్నారు

## పెదవులు

మధురమయిన పాటయినా
ముల్లులాటి మాటయినా
పెదవుల అనుమతిమీదే కదా
పదుగురిలోకీ వచ్చేది

నాలుక కనే పదాల శిశువులు
పెదవుల గవాక్షం తెరుచుకునేకదా
ప్రపంచాన్ని వీక్షించేది
మాటల కత్తుల్ని
గొంతులోనే అడ్డుకొని
పువ్వుల్లాటి పలుకుల్ని
ప్రసవించేది పెదవులేకదా
పెదవిలోనే ఉంది
మనిషి సాధించిన మధుర ప్రజ్ఞ

పెదవులే ప్రేమబంధాలు
పెదవులే సుమధుర నిలయాలు
పెదవులే క్రోధాగ్ని జ్వాలలు
పెదవులే కాలకూట విషన్నాగులు

–జి. నరసింహమూర్తి

రాజ్యం కంగారుగా.

"ఇందులో కంగారు పడాల్సింది ఏమీ లేదమ్మా. నాన్నగారు అశ్రద్ధ చేయడం వల్ల మందులతో పోయేది ఆపరేషన్ చేయాల్సి వచ్చింది" అన్నాడు.

"ఆయన ఎప్పుడూ ఇంతేరా! ఏదీ చెప్పరు. ప్రతిదీ దాచుకునే ప్రయత్నం చేస్తారు. గోటితో పోయేదానిని గొడ్డలి దాకా తీసుకు వస్తారు. దానివలన వచ్చే పరిణామాల గురించి ఆలోచించరు. ఇన్ని సంవత్సరాలుగా మనం ఎవరం కనిపెట్టలేకపోయాం. హారిక వల్ల తెలుసుకోగలిగాం" అన్నారు.

"పోనీలేమ్మా! ఇప్పటికయినా తెలిసింది"

"ఆపరేషన్ అంటే చాలా డబ్బు అవసరం అవుతుందేమో! ఎక్కడ నుంచి తెస్తావు?"

"ఎక్కడో అక్కడ ప్రయత్నం చేస్తాలే. నాన్నగారి కంటే డబ్బు ముఖ్యంకాదు" అన్నాడు.

రామనాథం గారికి తల్లీ కొడుకుల మాటల్లో ఒక్క ముక్క వినిపించడంలేదు. కాని వాళ్ళు తన గురించే మాట్లాడుకుంటున్నారని అర్థమైంది. అసలు డాక్టర్ ఏమన్నాడో! తనకి మళ్ళీ అన్నీ వినబడతాయన్నారో, లేదో... అందరిలా తను వినగలనో, లేదో అని ఆలోచిస్తున్నారు.

వారం గడిచి, రెండో వారంలో అడుగిడినా ఎవరూ తన చెవి గురించి మాట్లాడటం కాని, డాక్టర్ దగ్గరకి వెళదామని అనడం కాని జరగలేదు. పోనీలే ఇదీ ఒకందుకు మంచిది అనుకున్నా... తనకి పిల్లల అల్లరి విని ఆనందించాలని, టీవీలలో వచ్చే సినిమాలని ఒకప్పటి మూకీ సినిమాలలా కాక మామూలుగా చూడాలని, ఇంట్లో అందరి మాటలు వినాలని, అలాగే అందరితో తనూ మాట్లాడాలని అనుకోసాగారు. కానీ వాడిని అడిగితే... ఏదో ఒకటి చెప్పి వాయిదా వేస్తున్నాడు. కొడుకు, కోడలు తరచుగా ఘర్షణలు పడుతున్నారు. బహుశా తన గురించేనని అనుకున్నారు. తను రెండు, మూడు సార్లు రవిచంద్రకి గుర్తుచేశాడు. ఏవో సైగలు చేసి వెళ్ళిపోయాడు.

నిశ్శబ్దం ఒంటరితనం కన్నా భయంకరమైనది. ఒకప్పుడు శబ్దం వినటం కన్నా నిశ్శబ్దంగా వుండటానికి ఇష్టపడ్డాను. అప్పుడు తన గురించి ఇతరులకు తెలియదు. అందువలన జాలిపడటం, జాలి ప్రదర్శించడం, తన గురించి బాధపడడం వుండేది కాదు. కాబట్టి తనకి అలవాటైంది. కాని ఇప్పుడు ఇంట్లో అందరు తన గురించి బాధపడడం తట్టుకోలేకపోతున్నాడు. ఈ ప్రపంచంలో అందరికన్నా పేదవాడు ఎవరంటే... తనే అయుంటాడు. తనే కాదు తనలాంటి వారందరూ ఆ కోవకి చెందుతారు. కళ్ళు లేనివాడు, కాళ్ళు లేనివాడు, మూగవాడు కూడా కోయిల రాగాలు వినగలడు. గాన గంధర్వుడు ఘంటసాల పాటలు ఆలకించగలడు. ప్రముఖుల ప్రసంగాలను, ఉగాది కవితలను, పంచాంగ శ్రవణాన్ని వినగలడు. శబ్దాలను గ్రహించగలడు. తన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో తెలుసుకోగలడు. కాని తను ఏమీ వినలేడు. ఎవరేది మాట్లాడినా తను మూగవాడిలా వుండిపోవాలి. లక్షలు, కోట్లు వుంటే ఉపయోగం ఏం వుంది? సప్తస్వరాలు వినలేకపోయాక, ఎన్ని వున్నా ఏమి ప్రయోజనం! అంతా శూన్యం. బ్రతుకు అంధకారం. ఒకరోజు ఉదయం రామనాథం గారిని కలవటానికి కళాలయ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు.

"నమస్కారం మాస్టారూ!" అన్నారు.

"నమస్తే, రండి! ఏమిటిలా వచ్చారు!" అన్నారు.

## బిగించిన పిడికిలెత్తి

మొదలౌతోంది
రాక్షసక్రీడ మొదలౌతోంది
రాష్ట్రమంతా సమాయత్తమౌతోంది
నీవూ, నేనూ వెన్నునంటిన డొక్కలతో
కనీసం సూర్యోదయాన్ని చూడలేని కంటికి
అరచేయి అడ్డంపెట్టుకుని..
కొత్త కాంతి వస్తుందేమోనన్న ఆశతో...
మరోసారి మోసపోయే తరుణం
వస్తోందిగా తోస్తోంది
జేబులు కాలీలౌతున్న బడా నేతలు
మరో బిక్షాటనకు వ్యూహాలతో సిద్ధమౌతున్నారు.
అందుకే...
నాలోకి నేనుగా, నీలోకి నీవుగా పోదాం...
లోన దాగిన అమావాస్య చీకటిని జ్ఞానవంతులమై..
ఆ చీకట్లను చీల్చేద్దాం
మొదలౌతుందనుకుంటున్న రాబంధుల
రాక్షస క్రీడను సమైక్యంగా బిగించిన
పిడికిలెత్తి తరిమేద్దాం...
ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

-కొత్తపల్లి త్రినాథరాజు

## రాలిన ఒక రాగసుమం

పాటలో పాల మీగడలు
పాటలో నల్లమల పుట్టతేనెలు
పాటలో కలకత్తా రసగుల్లాలు
పాటలో నూజివీడు ఇమాం పసందులు
పాటల్లో చెలం మల్లెపూలు
పాటల్లో మొగల్ మొనార్కులు
పాటల్లో సన్నాయి సురభిళాలు
పాటల్లో అనారు పూలతోటలు
పాటలోనూ ఆమనులు / పాటలోనూ ప్రేమలేఖలు
పాటలోనూ ఏరువాకలు/ పాటలోనూ ఛాంగురేలు
ఒక పాటతో మన రోజులే మారిపోతాయి
ఎన్నివిను, ఎంతవిను, ఒకపట్టాన ఆ పాటపై
మోజుతీరదు
ఒక్క పాటతో అన్నేసి బొమ్మలూ ఇట్టే అమ్ముడైపోతాయి
ఆ మాటకొస్తే పాట కంగారు పడటం ఆమెతోనే
మానేసింది
ఒక వలపుతేనే పాటతో పులకించని మదీ పులకిస్తుంది
ఎంతకొమ్ములు తిరిగిన మగవారూ ఆ పాట కొంగు
తగిలితే పోలేరు
పాటకు ఒక్క గొంతునే కాదు? తన ఆయుష్షునూ
ధారపోస్తుంది
ఒకే ఒక పాటతో మన జీవితాల్నీ సఫలం చేస్తుంది
"కానగరావా శ్రీహరీ" అంటూ తనూ కానరాని
లోకాలకు వెళ్తుంది
మనకూ, "ఈ తీరని నిన్నెరిగి పలుకగా నా
తరమా జగదేకకారణా" అన్పిస్తుంది
అది పున్నవి పగలైనా అట వెన్నెల కురిసే
తీరుతుంది
బస్తీ దొరసానులూ తమ ముస్తాబునొకపరి
పాటతో సరిచూసుకోవాల్సే ఉంటుంది
ఒకా 'కోలోకోలో'తోనే కదా, తెలుగు పాట
కోలుకుంది
ఒక 'లత' ఎంత ఎదిగినా, ఈ పాటమెట్టు దిగువే
నిలుచుంటుంది
ఎక్కడ పందిట్లో పెళ్ళవుతున్నా మన చెవుల్లో ఇల్లు
కట్టుకుంటుంది
ఎక్కడెక్కడి ఎదల్లో గూడుకట్టుకున్నా, చిగురాకులలో
చిలకామ్మగానే మిగిలిపోతుంది.

-లకుమ

"రానున్న ఉగాది రోజు శతావధాన కార్యక్రమం పెట్టాం. అవధానిగా మీ పేరు వేశాం. హైదరాబాద్ రవీంద్ర భారతిలో కార్యక్రమం. సినీ నటులు, రాజకీయ ప్రముఖులు వస్తున్నారు. మీరు తప్పకుండా రావాలి అంటూ ఆహ్వానపత్రం ఇచ్చారు.

రాజ్యంగారు కాఫీలు తెచ్చి ఇచ్చారు.

"బాగున్నారా! ఈ మధ్య రావడం మానేశారు" అన్నారు.

"ఎక్కడమ్మా! ఎప్పుడూ ఏదో ఒక పనులు వుంటూనే వున్నాయి. మీరు కూడా రండి. మీవారితో అవధాన కార్యక్రమం. సాంస్కృతి కార్యక్రమాలు కూడా వున్నాయి."

"భోంచేసి వెళుదురుకాని! ఆయనతో మాట్లాడుతూ వుండండి"

"టైం లేదమ్మా. ఇంకా ప్రముఖుల్ని కలవాలి. మరోసారి తప్పక వస్తాం" అన్నారు.

"మొత్తానికి మీ సంస్థ సాహిత్యానికి మంచి కృషి చేస్తుంది. ఇలా సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తూ, కవులకు సేవ చేస్తున్న మీరు అభినందనీయులు."

"తప్పకుండా రావాలి" అని వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళాక మళ్ళీ ఆలోచనలో పడ్డారు.

సభకి ఎంతోమంది ప్రముఖులు వస్తారు. మంచి మంచి కవితలు చదువుతారు. సాహిత్యంలో కాకలు తిరిగిన యోధులు పృచ్ఛకులుగా వుంటారు. వాళ్ళు ఏ సమస్య ఇచ్చి ఇరుకున పెడతారో, కొంతమంది కాగితాల మీద వ్రాసి ఇస్తారు. కొంతమంది నోటితో చెపుతారు. ఇలా వెళ్ళి చేసేది ఏం వుంటుంది. అభాసు పాలు అవడం తప్ప. సభకి ఇంకా నెల రోజులపైన సమయం వుంది కాబట్టి డాక్టర్ దగ్గరకి వెళితే పూర్తి వివరాలు తెలుస్తాయనుకుని ఆ సాయంత్రం డాక్టర్ దశరథ్‌ని కలిశారు.

దశరథ్ ఆయనకి అర్థమయ్యేటట్లు కాగితంపై వ్రాసి చూపించారు. అది చదివిన రామనాథం గారు మరో మాట మాట్లాడకుండా ఇంటికి వచ్చారు. నిజమే ఏభయ వేలంటే వాడు ఎక్కడ నుంచి తేగలడు. వాడిదసలే ప్రైవేటు ఉద్యోగం. వాడి నెల సంపాదన, తన పెన్షన్ కలిపి కుటుంబం నెట్టుకురావడమే కష్టం. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా ఏనాడు నోరు తెరచి చెప్పలేదు. ఆపరేషన్ చేయించలేక పోయినందుకు ఎంత బాధపడుతున్నాడో, ఏమో అనుకున్నారు.

ఈ సంఘటన జరిగిన నాలుగు రోజులకు రామ

నాథం గార్ని దశరథ్ దగ్గరికి తీసుకెళ్ళాడు రవిచంద్ర.

డాక్టర్ దశరథ్ రామనాథం గారి చెవిని మరోసారి పరీక్షించి డ్రాప్స్ వేసి పంపాడు. అలా ఆరుసార్లు డ్రాప్స్ వేశాక రవిచంద్రతో ఆపరేషన్ తేదీ చెప్పాడు. ఈలోపు బి.పి. పరీక్ష చేయాలన్నారు.

అనుకున్న తేదీకి ఆపరేషన్ జరిగింది. కొన్ని జాగ్రత్తలు చెప్పి రెండు రోజుల తర్వాత ఇంటికి పంపారు. వారం విశ్రాంతి తీసుకొమ్మని చెప్పారు.

రామనాథంగారు అన్నీ తినగలుగుతున్నారు. పిల్లల అల్లరిని ఎంజాయ్ చేస్తున్నారు. టీవీలో వచ్చే పాత పాటలు వింటున్నారు. పదేళ్ళ తరువాత రాజ్యం గారితో కష్టసుఖాలు పంచుకోగలుగుతున్నారు. ఆయనకి ఒకపక్క ఆనందం, మరోపక్క బాధ. రవిచంద్రకి డబ్బు ఎలా వచ్చింది? ఆ డబ్బు తేవడానికి ఎన్ని ఇబ్బందులు పడి వుంటాడు? ఆ మాట రాజ్యంతో అన్నా... ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

ఒకరోజు మధ్యాహ్నం రామనాథంగారు సాహిత్యం గురించి ఆర్టికల్ వ్రాసుకుంటుంటే రవిచంద్ర స్నేహితుడు వినోద్ వచ్చాడు.

"రావయ్యా వినోద్! చాలా కాలానికి వచ్చావు. అమ్మా, నాన్నా బావున్నారా" అన్నారు.

"బాగానే వున్నారంకుల్ మీకు బాగా వినపడుతుందా?" అన్నాడు.

"బ్రహ్మాండంగా వినపడుతోంది. ఇప్పుడు చాలా సంతోషంగానూ, మరోపక్క బాధగానూ వుంది" అన్నాడు.

"ఎందుకని అంకుల్?"

"నాకు ఆపరేషన్ చేయించడానికి రవిచంద్ర ఎన్ని ఇబ్బందులు పడ్డాడో అనిపిస్తోంది. కన్న తల్లిదండ్రులు భారం అనుకుని వృద్ధాశ్రమాలకు తరలిస్తున్న కొడుకులున్న ఈ రోజుల్లో... ఏభై వేలు పెట్టి ఆపరేషన్ చేయించాడంటే వాడు ఎంతగా ఎదిగిపోయాడో అనిపిస్తోంది" అన్నారు.

"ఆగండి అంకుల్. క్రెడిట్ అంతా వాడికే కాదు. హారికది కూడా. అసలు హారిక పోరు పెడితేనే మీ ఆపరేషన్ జరిగింది."

"ఆ విషయం నీకెలా తెలుసు?"

"ఆ నగలు తాకట్టు పెట్టింది మా షాపులోనే! ఈ విషయం మీతో చెప్పొద్దన్నాడు రవి. నేను చెప్పానని చెప్పకండి" అన్నాడు.

"నేనెందుకు చెపుతాను? చెప్పనులే" అన్నారు.

## రససిద్ధి

వివసత్వం నుండి అవసత్వం లోకి
నువ్వోదరి నేనోదరి విరుచుకు పడిపోతున్నప్పుడు
ఇరువురి నడుమ సురలోక గంగ ఉవ్వెత్తున
ఎగసిపడుతున్నప్పుడు
నిన్నటిదాకా...
నువ్వు నేను బిందువులం
ఇవ్వాళ మహా సింధువులం
ఇద్దరూ ఒకే దీపకళికలైనప్పుడు
ఒకరికొకరు ప్రమిదలుగా ఒకరికొకరు తైలంగా
మారినపుడు
ఒకరినొకరు వెలిగించి, వెలుగుతున్నప్పుడు
వెలుగూ... వారూ... వేరుకానప్పుడు
ఆకాశం ఆవలి అంచులోని నీలిమ సైతం
నిలువెల్లా ప్రకాశిస్తున్నప్పుడు
శూన్యం వెలుతురుగా పరివర్తన పొందినపుడు
అప్పుడు...
అప్పుడు...
ఏ మాటలకు అందని సౌందర్యం
జీవాత్మగా పరిణమిస్తున్న వైనం
రససిద్ధి పసిమొలకగా పరిమళిస్తుంది

**-కిన్నెర శ్రీదేవి**

ఆ రాత్రి రామనాథం గారు హారికతో...

"అమ్మా హారికా! పెళ్ళి కాగానే మొగుడ్ని కొంగున ముడేసుకుని అత్తమావల్ని వదిలేయమని చెపుతున్న ఈ రోజుల్లో నీ నగలు తాకట్టుపెట్టి నాకు ఆపరేషన్ చేయించావంటే... నువ్వు నిజంగా నా కూతురివే నమ్మా. నిన్ను ఎలా అభినందించాలో తెలియడంలేదు" అన్నారు.

"ఈ గొప్పతనం నాది కాదు మావయ్యాగారు, మీ అబ్బాయిది. మీరు వినికిడి శక్తి కోల్పోయి నిశ్శబ్దంతో చేస్తున్న పోరాటం చూడలేక మీ అబ్బాయితో చెప్పాను. ఎలాగైనా మీకు ఆపరేషన్ చేయించాలనుకున్నాం. ఇప్పుడు మీరు బాగా వినగలుగుతున్నారు. రేపు మీరు ఉగాది రోజు జరిగే శతావధానంలో పాల్గొని సన్మానం కూడా పొందవచ్చు."

రామనాథంగారు తృప్తిగా తలూపారు. ■